సాగర్ ఎడమ కాల్వకు నీరు విడుదల చేయాలి

- పంటను కాపాడండి
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎడమ కాల్వ పరిధి ఆయకట్టులో బోర్లు, బావులు, చెరువుల కింద 30 శాతం వరి పంట సాగు చేశారన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతికొచ్చిన పంట ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట పొలాలను కాపాడేందుకు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 524 అడుగుల నీటిమట్టం ఉందని, అందులో 15 టిఎంసిల నీటిని వాడుకునే అవకాశ ఉంటుందని చెప్పారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం వల్ల అక్కడి ప్రభుత్వంతో మన ప్రభుత్వం చర్చలు జరిపి ఆల్మట్టి ద్వారా నీటిని తెప్పించుకోవాలన్నారు. సాగర్ ఎడమ కాల్వకు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంపొందించాలన్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలన్నారు. అలా చేస్తే భవిష్యత్‌లో తాగునీటి సమస్య కూడా ఉండదని చెప్పారు. నీటి విడుదలపై ప్రభుత్వ స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్ తదితరులు ఉన్నారు.

యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్

- ఎక్మో పై మూడు రోజుల కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో ఎక్మో సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా ఎక్మో (ఇసిఎంఒ)పై 13వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. మూడురోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌నకు దేశ నలుమూలల నుంచి సుమారు వెయ్యి మందికిపైగా ఎక్మో వైద్యులు, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. దశాబ్ద కాలంలో భారతదేశంలో జరిగిన అతిపెద్ద ఎక్మో సమావేశాలలో ఇది ఒకటి. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. దాదాపు 40 ఏండ్ల కిందటే ఎక్మోకు రూపకల్పన జరిగినా పరిశోధనలు, వాడకంలో అనుభవాల కారణంగా ఎక్మో ఉపయోగించడం చాలా తక్కువగా ఉండేదన్నారు. ఇప్పుడు ఎక్మో పరికరం వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న సమయాల్లో గుండె, ఊపిరితిత్తులు పనిచేయని సమయంలో ఉపయోగకరంగా మారిందన్నారు. దేశంలో కోవిడ్ మహమ్మారి తర్వాత ఎక్మో అవసరం పెరిగిందని చెప్పారు. కోవిడ్ సమయంలో ఎక్కువ మంది రోగులను 'ఎక్మో' సహాయంతో కాపాడిన ఆస్పత్రుల్లో యశోద హాస్పిటల్స్ ఒకటి అన్నారు. ఎక్మో మద్దతు, ఊపిరితిత్తుల మార్పిడితో ప్రాణాలను కాపాడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో 100 కంటే ఎక్కువ ఎయిర్ అంబులెన్స్ బదిలీలు యశోద హాస్పిటల్స్‌కు జరిగాయని తెలిపారు. ఈ సదస్సు నైపుణ్యాన్ని పంచుకోవడంపై దృష్టి సారించి, రోగుల సంరక్షణలో ఆవిష్కరణ, సహకారం, శ్రేష్ఠతను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. యశోద హాస్పిటల్స్ సీనియర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ స్పెషలిస్ట్, డాక్టర్ వెంకట్‌రామన్ కోలాలి మాట్లాడుతూ.. మరణం అంచు నుంచి మళ్లీ నిండు జీవితం వైపు మళ్లించే పరికరం ఎక్మో అన్నారు. వ్యక్తి గుండె, ఊపిరితిత్తులు పనిచేయని సమయంలో ఎక్మో పరికరాన్ని ఉపయోగించి ఆ వ్యక్తి శ్వాసకోశాలు, గుండె చేసే పనులను శరీరం బయట చేస్తారని తెలిపారు. సదస్సులో అడల్ట్ అండ్ పీడియాట్రిక్ వైద్యులు, పారామెడికల్ స్టాఫ్ పెర్ఫ్యూనిస్ట్ నర్సింగ్, రెస్పిరేటరీ థెరపిస్ట్‌లు పాల్గొన్నారు.

జలాశయాలలో సోలార్ విద్యుత్ కేంద్రాలు వద్దు!

- తెలంగాణ ఫిషరీస్ సొసైటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జలాశయాల్లో సౌరశక్తి ఆధారంగా నీటిపై తెలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలను బేషరతుగా విరమించుకోవాలని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జలాశయాలలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడాన్ని ఆయన ఒక ప్రకటనలో తప్పుపట్టారు. సర్కారు తీసుకునే నిర్ణయం వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది మత్స్యకారుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని జలాశయాల్లో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించిందనీ, దానితో ఉత్పన్నమయ్యే సామాజిక, పర్యావరణ సంబంధమైన సమస్యలపై తమ సంస్థ వ్యక్తం చేసిన అభిప్రాయాలను మన్నించి వాటి నిర్మాణాన్ని పక్కకు పెట్టిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని 130 రిజర్వాయర్లలో దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులు జీవనోపాధిని పొందుతున్నారనీ, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల చేపల వేటకు తీవ్రమైన ఆటంకాలు తలెత్తుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మేడారం జాతరకు మరో రూ.30 కోట్లు

- కాళోజీ కళాక్షేత్రం మూడు నెలల్లో పూర్తి..
- కరెంటు బిల్లులు త్వరలోనే మాఫీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం జాతరను ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే రూ.75 కోట్లను విడుదల చేశామని, త్వరలో మరో రూ.30 కోట్లను మంజూరు చేయనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హన్మకొండ పట్టణంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 6 జిల్లాల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, విప్ డాక్టర్ రామచంద్రునాయక్, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు మాస్టర్‌ప్లాన్ కోసం సేకరించిన భూములు, వేసిన రోడ్లతోపాటు కాళోజీ కళాక్షేత్ర పనులనూ స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఆర్భాటంగా చేపట్టిన ప్రాజెక్టులు, పనులు, వాటి పురోగతి, వారిచ్చిన జీవోలు, అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు, ఉన్న అడ్డంకులు, ఫారెస్టు క్లియరెన్స్‌లు, అవసరమైన భూసేకరణపై అధికారులతో చర్చించామన్నారు. నీటిపారుదల శాఖ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పురోగతి, పేరుకుపోయిన బిల్లుల పరిష్కారంపై ఆరాతీశామన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి దేవాదుల తదితర ప్రాజెక్టుల పనులు పూర్తి కాలేదని, ప్రధాన కాలువల నిర్మాణం పూర్తి చేయకుండానే లక్షలాది ఎకరాలకు సాగునీరిచ్చినట్టు గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుందని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం తాగునీరందడం లేదని చర్చల్లో తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం జారీ చేసిన 59 జీవోతో ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని, వాటిపై దృష్టి సారించి ఆ భూములు పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని పదేండ్లుగా బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో 3 నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే 200 యూనిట్లలోపు వారికి కరెంటు బిల్లులు మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని, ఒక్కో నియోజకవర్గంలో రూ.300 కోట్ల మేరకు శంకుస్థాపనలు చేసి పనులు చేయకుండా వదిలేసిందని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. గత బిఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో 40 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని విప్ డాక్టర్ రామచంద్రునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించని నాటి మంత్రి కెటిఆర్ ఇప్పుడు సర్పంచ్‌ల బిల్లుల గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు.

గీత కార్మికుల ప్రాణాలను కాపాడండి

- బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నంకు కెజికెఎస్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బతుకుతెరువు కోసం ప్రమాదకరమైన కల్లుగీత వృత్తి చేస్తూ రెండు రోజులకు ఒకరుచొప్పున చనిపోతున్నారని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కెజికెఎస్) తీసుకెళ్లింది. వందలాది మంది కాళ్లు చేతులు విరిగి మంచాన పడుతున్నారని గుర్తు చేసింది. వెంటనే ప్రమాద నివారణా చర్యలు చేపట్టాలనీ, సురక్షిత(సేఫ్టీ) మోకులు ఇవ్వాలని కెజికెఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు మంత్రిని కోరారు. శనివారం హైదరాబాదులోని మంత్రిని కలిసి 16 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా వృత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల మేర ఎక్స్‌గ్రేషియా నెలరోజుల్లో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ బోర్డు నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. టాడీ కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి గీత కార్మికుల ఉపాధి మెరుగుపరచాలని కోరారు. గతంలో ఇచ్చిన సర్కారు ప్రకారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలనీ, ఎన్నికల ప్రణాళిక ప్రకారం జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలలో తాము ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేస్తామన్నారు. త్వరలో అన్నీ బిసి కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కేలండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సర్వాయి పాపన్న జీవన చిత్రాలను, వృత్తిని, ఉద్యమాన్ని ప్రతిబింబించే విధంగా కేలండర్ ఉందంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వి వెంకట నరసయ్య, హైదరాబాద్ అధ్యక్షులు ఎం కష్ణస్వామిగౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్‌గౌడ్, ఆంజనేయులు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు హరిచరణ్ గౌడ్, ప్రేమ్‌దాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌కోర్-ఆల్కమ్ సిఎండికి ప్రశంసలు

ఆకర్షిస్తున్న సంస్థ ఉత్పత్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలోని హైటెక్స్ వేదికగా జరుగుతున్న ఎస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో ఎన్‌కోర్-ఆల్కమ్ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. ఆ సంస్థ స్టాల్‌ను శనివారం అదానీ పోర్ట్స్, లాజిస్టిక్స్ కార్పొరేట్ అఫైర్స్ ఎపి, తెలంగాణ హెడ్ పి అంజిరెడ్డి, రిలయన్స్ కార్పొరేట్ అఫైర్స్ ప్రతినిధి రవినాథ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌కోర్-ఆల్కమ్ ఫౌండర్, సిఎండి అవుతు శివకోటిరెడ్డి, ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ మనుభాయ్, ఎన్‌కోర్ డైరెక్టర్లు అవుతు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీ హర్షను వారు అభినందించారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. స్టాల్‌లో 1.8 టన్నుల బరువున్న 18 అడుగుల ఎత్తైన విండోను ప్రదర్శిస్తున్నామని అవుతు శివకోటిరెడ్డి తెలిపారు. కంపెనీ తయారు చేస్తున్న విభిన్న, వినూత్న ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరాయని తెలిపారు.

ఎసిబికి చిక్కిన డిప్యూటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవినీతికి పాల్పడుతూ నాగర్ కర్నూల్ జిల్లా వనపర్తి మండలం డిప్యూటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమావాత్ వాస్య ఎసిబికి పట్టుబడ్డారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన ఒక వ్యక్తి తన భూమి సర్వేకు సంబంధించి వనపర్తి ఆర్‌డిఒ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సర్వేను నిర్వహించిన రమావత్ వాస్య రూ. ఎనిమిది వేలు ఇస్తేనే సర్వే రిపోర్ట్‌ను ఇస్తానంటూ డిమాండ్ చేశాడు. ఈ డబ్బులను తీసుకుంటుండగా.. రమావత్ వాస్యను ఎసిబి అధికారులు అతని కార్యాలయం వద్దనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఒక్కసీటూ రాదు

- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదనీ, కెసిఆర్, కెటిఆర్, కవిత, హరీశ్‌రావు, సంతోశ్‌కుమార్ పోటీచేసినా ఓటమి తప్పదని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎం. రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల్లో 299 టిఎంసిల వాటాకు ఒప్పందం చేసుకుంది కెసిఆరేననీ, ఒకవేళ తెలంగాణకు అన్యాయం జరిగితే అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకుపోలేదని ప్రశ్నించారు. తెలంగాణకు 299 టిఎంసిలు చాలని కృష్ణా జలాల పంపకాల సమావేశంలో కెసిఆర్ సంతకం పెట్టింది వాస్తవం కాదా? ఈ విషయం ఆనాడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే బిజెపిని బద్నాం చేసేందుకు ప్రచారం మొదలుపెడుతున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఏం లాభం జరిగిందో అమరవీరుల స్థూపం వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అందరికంటే ఎక్కువ స్థానాలను తమ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేండ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఉద్యమకారులు, కార్యకర్తలకు కనీసం గౌరవించకపోవడం వల్లనే నేడు ఆ పార్టీకి ఇలాంటి దుస్థితి దాపురించిందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో వందలకోట్లు సమర్పించుకున్న వారికే బిఆర్‌ఎస్ టికెట్లు అమ్ముకుంటారని ఆరోపించారు. సమావేశంలో బిజెపి నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి, రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పేదలపై అక్రమ కేసులు ఎత్తేయాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.పార్థసారథి
- జగిత్యాల జిల్లా కేంద్రంలో గుడిసెల స్థలం పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటి స్థలం కోసం పోరాడుతున్న పేదలపై అక్రమ కేసులు నమోదు చేయడంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది కె.పార్థసారథి తీవ్రంగా ఖండించారు. వెంటనే వారిపై కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఎన్.వెంకటేష్, మాధవ రెడ్డి, ఎన్.కుమార్, ప్రసాద్, గణేష్, తిప్పరపు సురేష్‌తో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని టిఆర్‌నగర్ శివారులో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలు ఇంటి స్థలం కోసం పోరాడుతుంటే ప్రాథమిక ఆధారాలు లేకుండా సెక్షన్ ఐపిసి 307 కింద అత్యాయత్నం కేసు నమోదు చేయడం, పేదలను అక్రమంగా అరెస్టు చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన తొమ్మిది మందిని విడుదల చేయాలని, తప్పుడు కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయపరమైన సహాయ సహకారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అందిస్తుందని చెప్పారు.

వింగ్స్ ఇండియాకు సందర్శకుల తాకిడి

- అలరించిన విమాన విన్యాసాలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన వింగ్స్ ఇండియా - 2024 ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. చివరి రెండు రోజులు సందర్శకులను అనుమతించడంతో శనివారం సందడి నెలకొంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఇక్కడి విమానాలు చూసి మురిసిపోయారు. ఆదివారం కూడా సందర్శకులను అనుమతిస్తున్నారు. ప్రదర్శనలో ప్రతి విమానం పక్కన 30 అడుగుల మేర బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉంచిన విమానాలను చూడటానికి ఆసక్తిని కనబర్చడంతో పాటుగా.. హెలిక్యాప్టర్ విన్యాసాలు అబ్బురపర్చాయి. విమానాలకు సంబంధించిన వివరాలను, ప్రత్యేకతలను ఆయా సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు.

శివమణితో సంగీతోత్సవం

విమానాల ప్రదర్శన మాత్రమే కాకుండా వినోదం కోసం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శివమణి బృందంతో సంగీతోత్సవం ఏర్పాటు చేశారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 'కలంకారి' విమానం నేపథ్యంగా వీక్షకులను తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బ్రాండ్‌కు చెందిన సరికొత్త బోయింగ్ 737-8 ఎయిర్‌క్రాఫ్ట్, విటి-బిఎక్స్‌హెచ్, కలంకారితో కూడిన టార్మిక్ వేదికగా శివమణి తన ప్రదర్శన ఇచ్చారు. భారతదేశ కళాత్మక ప్రతిభ, వైవిధ్యాన్ని వేడుక చేయడం పట్ల సంతోషిస్తున్నామని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సిద్ధార్థ బుటాలియా పేర్కొన్నారు. జనవరి 21తో ముగియనున్న ఈ షోకు బుక్‌మై షోలో ముందుగా టికెట్లు కొనుగోలు చేసుకోవడానికి వీలుంది. ప్రవేశ రుసుం ఒక్కొక్కరికి రూ.750గా నిర్ణయించారు. మూడేళ్లలోపు పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు.

ధరణి లీల.. అంకెల గోల

- భూమి విలువ మార్పిడిలో బిఆర్‌ఎస్ నేత మాయ?
- ఎకరం రూ.4.50 లక్షల భూమిని రూ.30 లక్షలుగా మార్పిడి
- జిన్నింగ్ మిల్లు రుణం కోసం భూ విలువ పెంచినట్టు ఆరోపణలు
- ఆగస్టులో కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు.. ఐదు నెలల తర్వాత విచారణ
- ధరణిలో ఇలాంటి మాయలెన్నైనా చేయొచ్చంటున్న నిపుణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణిని అడ్డుపెట్టుకుని కొంతమంది బిఆర్‌ఎస్ నేతలు చేసిన లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. గత ప్రభుత్వం ఓ ప్రయివేటు సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతలు అప్పగించడంతో దానిలో రాత్రికి రాత్రే అనుకూల చేర్పులు మార్పులు చోటు చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. తాజాగా ఇలాంటి ఉదంతం ఒకటి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం రెవెన్యూలోని సర్వే నంబర్ 474లో వెలుగు చూసింది. ఈ గ్రామ రెవెన్యూలోని అన్ని సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరం భూమి రూ.4.50 లక్షలు ఉండగా 474 సర్వే నంబర్‌లో మాత్రం రూ.30.49 లక్షలుగా పేర్కొనడం వివాదానికి దారి తీసింది. దీనిపై ఆ సర్వే నంబర్‌లో 14 ఎకరాల వరకు భూమి ఉన్న 13 మంది రైతులు జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌కు గతేడాది ఆగస్టు 3న ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఐదు నెలల తర్వాత దీనిపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు శుక్రవారం విచారణ నిర్వహించారు.

బ్యాంకు నుంచి అధిక రుణం కోసమే ఎత్తుగడ..!

కూసుమంచి మండలానికి చెందిన బిఆర్‌ఎస్ నేత ఒకరు బ్యాంకుల నుంచి అధిక రుణం పొందేందుకు తన భూముల విలువ పెంచుకోవడంలో భాగంగా ఈ వ్యూహం పన్నినట్టు సంబంధిత రైతులు ఆరోపిస్తున్నారు. సదరు బిఆర్‌ఎస్ నేతకు నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం రెవెన్యూలోని 474 సర్వే నంబర్‌లో 1.10 ఎకరాలు, 466 సర్వే నంబర్‌లో 2 ఎకరాల భూమి ఉంది. సంబంధిత నేత కూసుమంచి మండలంలో మిల్లు కోసం బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నారు. అందుకు తన ఆస్తుల విలువను ఎక్కువ చేసి చూపిస్తే ఎక్కువ రుణం పొందే ఆస్కారం ఉండటంతో ఈ వ్యవహారానికి పాల్పడ్డాడని రైతులు ఆరోపిస్తున్నారు. 474తో పాటు 466 సర్వే నంబర్‌లోని భూమి విలువను కూడా ఇలాగే పెంచి ధరణి పోర్టల్‌లో నమోదు చేసినట్టు తెలుస్తోంది. కానీ 474 నంబర్‌పైనే ఫిర్యాదు రావడంతో ఈ సర్వేనంబర్ భూ విలువపైనే విచారణ చేస్తున్నారు.

గతంలోనే మాయ.. ధరణిలోనూ కొనసాగింపు..

2020లో నాటి ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో భూముల విస్తీర్ణం, విలువలు, సర్వే నంబర్లను పక్కాగా నమోదు చేయొచ్చని పేర్కొంది. పారదర్శకతకు మరో పేరుగా ధరణిని అభివర్ణించింది. కానీ పోర్టల్‌తో రైతుల భూ సమస్యలు తీరకపోగా కొత్త సమస్యలు వచ్చిచేరాయి. గతంలోని మాయలను సైతం ధరణిలోనూ కొనసాగించడంతో రైతులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. కూసుమంచి మండలానికి చెందిన నేత ఆరేండ్ల క్రితం రాజేశ్వరపురం రెవెన్యూలో 474, 466 సర్వే నంబర్లలో సుమారు 3.10 ఎకరాల భూమి తీసుకున్నాడు. జిన్నింగ్‌మిల్లు స్థాపనకు రుణం కోసం ఆనాడు రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరం రూ. రెండు లక్షల చొప్పున తన పేరు మీద రిజిస్ట్రేషన్ జరిగింది. ఆ తర్వాత 466 సర్వేనంబర్‌లో పారాబాయిల్డ్ రైసు మిల్లు ఏర్పాటు పేరుతో భూమి విలువ పెంచుకునేందుకు వీలుగా వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయించుకున్నాడు. దాంతో నాడు ఎకరం రూ. 2 లక్షలున్న భూమి విలువ ఒక్కసారిగా రూ.14.5లక్షలకు చేరింది. రెండేండ్ల క్రితం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భూ రిజిస్ట్రేషన్ విలువలను పెంచడంతో నాడు రాజేశ్వరపురం రెవెన్యూలో ఉన్న భూములన్నీ ఎకరం రూ. 2 లక్షల నుంచి రూ.4.50 లక్షలకు చేరాయి. కానీ 466, 474 సర్వే నంబర్‌లోని భూములు మాత్రం వ్యవసాయేతర నంబర్లుగా నమోదు కావడంతో ఎకరం రూ.14.5 లక్షల నుంచి రూ.30.45లక్షలకు చేరాయి. వ్యవసాయేతర భూములుగా ఈ రెండు సర్వే నంబర్లు నమోదైనప్పటికీ ఇన్ని రోజులుగా రైతుబంధు వస్తుండటం, ఈ సర్వేనంబర్లలోని ఏ రైతూ భూములు అమ్మకానికి పెట్టకపోవడంతో ఈ విషయాలేవీ బయటకు రాలేదు. 474 సర్వే నంబర్‌లో ఉన్న చావా లెనిన్‌బాబు తనకున్న మూడు ఎకరాల్లో కొంత భూమిని ఇదే గ్రామానికి చెందిన పుసునూరి వాసుకు విక్రయించాడు. రూ.10లక్షల బయానాను వాసు చెల్లించారు. తీరా రిజిస్ట్రేషన్ దగ్గరకు వెళ్లే సరికి భూ విలువ అధికంగా ఉండటం మూలంగా భారీగా ట్యాక్స్‌లు చెల్లించాల్సి వచ్చింది. దాంతో భూక్రయ, విక్రేతల మధ్య గొడవలు తలెత్తడంతో అసలు విషయం బయటకు వచ్చింది. కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేయడం, బిఆర్‌ఎస్ నుంచి అధికారమార్పిడి జరగడంతో ఇప్పుడు 'తీగలాగితే డొంక కదిలే' దిశగా వ్యవహారం వెళ్తోంది.

తప్పు సరిచేయాలంటే పెద్ద ప్రాసెస్..

ధరణిలో చోటుచేసుకున్న ఈ తప్పును సరిచేయాలంటే ఓ పెద్ద ప్రాసెస్ అని నిపుణులు చెబుతున్నారు. అడిషనల్ కలెక్టర్, సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్‌లతో కూడిన బృందం విచారణ నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక ఇస్తే.. దాన్ని సిసిఎల్‌ఏకు పంపాల్సి ఉంటుంది. అక్కడ ఆమోదం లభించి విలువను సరి చేయాలంటే పాత విధానం ప్రకారం కనీసం రెండు, మూడేండ్లయినా పడుతుందని చెబుతున్నారు. అదీ నిరంతరం ఫాలోఅప్ చేస్తేనే సాధ్యమవుతుందని అంటున్నారు.

మార్కెట్ విలువే రూ.30లక్షలు లేదు - దండ రంగయ్య, బాధిత రైతు

మా రాజేశ్వరపురం రెవెన్యూలో మెయిన్‌రోడ్డు భూములే మార్కెట్ విలువ ప్రకారం రూ.30 లక్షలకు పైగా పలకట్లేదు. అటువంటిది 474, 466 సర్వేనంబర్లలో భూముల రిజిస్ట్రేషన్ విలువను రూ.30 లక్షలకు పైగా ధరణిలో చూపెడుతుండటంతో మేము భూములు అమ్ముకోలేకపోతున్నాం. భూములు కొన్నవాళ్లు ట్యాక్స్‌ల రూపేణ భారీ మొత్తాలను చెల్లించాల్సి రావడంతో మాకొద్దని గొడవ పడుతున్నారు. అందుకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ధరణితో ఇలాంటి ఇబ్బందులు అధికమయ్యాయి.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.7/2021
ఇన్
ఓ.ఎస్.17/2014
బండి సత్యనారాయణ .... డిహెచ్‌ఆర్
వర్సెస్
వేశపోగు ప్రభాకరరావు చనిపోయినందున వారసులు 1) వేశపోగు ప్రభావతి మరియు ఇతరులు.. జెడిఆర్స్
టు,
జెడిఆర్-4
వేశపోగు సంధ్య, తండ్రి: లేట్ ప్రభాకర్
నివాసం: సెన్సెస్ హాస్పటల్, నాగోలు దిల్‌షుక్‌నగర్, హైదరాబాద్
జెడిఆర్-7
వేశపోగు బ్యూలా, తండ్రి: లేట్ ప్రభాకర్
నివాసం: నర్సింగ్ కేర్ హాస్పటల్, జూబ్లిహిల్స్, హైదరాబాద్.
పై నెంబరు ఇ.పి. 7/2021 నందు జెడిఆర్‌లు అయిన 4 మరియు 7 మీకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ అందుట లేదు. కావున కోర్టు వారు పేపరు ప్రకటనకు ఆర్డర్ వేసి తేదీ: 30-01-2024కు వాయిదా వేసియున్నారు. సదరు ఇ.పి.లో జెడిఆర్‌లు 4 మరియు 7 తేదీ: 30-01-2024 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షమందు విమర్శ చేసి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 30-01-2024 — ఇట్లు
మార్కాపురం — ఇ.శారద
అడ్వకేట్, మార్కాపురం.

జనాభాకనుగుణంగా బస్సులు పునరుద్ధరించండి

- ఆర్‌టిసి ఎమ్‌డికి ఐద్వా వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనాభాకనుగుణంగా ఆర్‌టిసి బస్సులను పునరుద్ధరించాలని, నగరంలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఆర్‌టిసి ఎమ్‌డి సజ్జనార్‌ను ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు ఎ.పద్మ, కార్యదర్శి కె.నాగలక్ష్మి, సహాయ కార్యదర్శి పి.విమల, కోశాధికారి వై.వరలక్ష్మి తదితరులు కలిశారు. నగరంలో ఆర్‌టిసి బస్సుల సంఖ్య పెంచాలని, కొత్త బస్సులను వేయాలంటూ మెమోరాండం అందజేశారు. ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం సౌకర్యం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని, అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో వెయ్యి బస్సులను తగ్గించిందని ఎండి దృష్టికి తీసుకెళ్లారు. బస్సులను తగ్గించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నగర శివారు ప్రాంతాలు, కాలనీ వాసులకు బస్సు సర్వీసులు అందడం లేదన్నారు. దీంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ప్రయివేటు వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించాలని, ట్రిప్‌లను పెంచాలని కోరారు. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రద్దయిన బస్సులను పునరుద్ధరించడంతోపాటు కొత్త బస్సులను వేయాలన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా లేడీస్ స్పెషల్ బస్సులను సైతం వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మ్యాగీ హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మ్యాగీ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ డాక్టర్ జాక్ సింపసాన్, చైర్మన్ నవీన్ చెట్టుపల్లి, అధ్యాపక సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్రావణి చెట్టుపల్లి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, ఆ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో మెళకువలు పాటించి పట్టు సాధించాలని అన్నారు. కేవలం చదువే కాకుండా, సమాజంపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభకు మంచి కళాశాలలు ఉన్నప్పటికీ... ఉపాధి కల్పనకు ఎలాంటి అవకాశాలు లేక యువత నిరుత్సాహపడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఆదుకోవడంలో మ్యాగీ స్కూల్ ముందుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యతోపాటు సామాజిక చైతన్యం కలిగి ఉండాలని తెలిపారు.

ఆధార్, పాన్‌కార్డులు ఆగమాగం

- చెత్తకుప్పలో వేలకొద్దీ కార్డులు
- వికారాబాద్ జిల్లాలో పోస్ట్‌మ్యాన్ దాసరి నర్సింలు నిర్వాకం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం : తహశీల్దార్ ప్రభులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్నింటికీ అవసరమైన ఆధార్, పాన్, ఎటిఎం కార్డులు చెత్త కుప్పలో ప్రత్యక్షమయ్యాయి. ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే ఆధార్ కార్డు, పాన్‌కార్డు, పాస్ పోర్టులతోపాటు బ్యాంకుల నుంచి వచ్చే ఎటిఎం కార్డులు ఇలా ఏదైనా పోస్టాఫీసుకు వస్తే.. వాటిని జాగ్రత్తగా ప్రజలకు తీసుకొచ్చి ఇచ్చే బాధ్యత పోస్ట్‌మ్యాన్‌ది. అయితే ఓ పోస్ట్‌మ్యాన్ మాత్రం తన బాధ్యతను పూర్తిగా విస్మరించాడు. ఫలితంగా లబ్దిదారులకు అందాల్సిన కార్డులు చెత్తకుప్పలో ప్రత్యక్షమయ్యాయి. గ్రామంలోని చెత్తకుప్పలో వేల సంఖ్యలో ఆధార్, పాన్ కార్డులతో పాటు వందల లెటర్లు కనిపించడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలకేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది.

మండల కేంద్రంలో దాసరి నర్సింలు అనే వ్యక్తి పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పోస్టాఫీసుకు వచ్చిన ఆధార్ కార్డు, పాన్ కార్డు, లెటర్లు ఎవరికి ఇవ్వకుండా వచ్చిన వాటన్నింటిని కార్యాలయంలోనే పెట్టుకున్నాడు. ఏకంగా 2011 నుంచి లబ్దిదారులకు వచ్చిన ఆధార్‌కార్డులు, పాన్ కార్డులు, ఎటిఎంలు, లెటర్లు ఇవ్వకుండా అలాగే పెట్టుకున్నాడు. అవన్నీ చెత్త కుప్పలో ప్రత్యక్షం కావడంతో ఆ పోస్ట్‌మ్యాన్ నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలో పేరుకుపోయిన ఏండ్ల నాటి ఆధార్, పాన్, ఎటిఎం కార్డులు, లెటర్లన్నింటినీ ఎవరికీ అనుమానం రాకుండా.. గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో వేయగా.. వాటిని ఆ ట్రాక్టర్ తీసుకెళ్లి చెత్తకుప్పలో పడేశారు. అటుగా వెళ్లిన కొంతమంది స్థానికులు.. వాటిని గమనించి షాకయ్యారు. ఆరా తీయడంతో పోస్ట్ మ్యాన్ నిర్లక్ష్యం గురించి తెలిసింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోస్ట్‌మ్యాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. చుట్టుపక్కల నుంచి ప్రజలు వచ్చి తమ ఆధార్ కార్డు ఇతరేతర పత్రాలను గుర్తించి ఎవరివి వారు తీసుకువెళ్తున్నారు. మిగిలిన ఆధార్ కార్డులు తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు.

ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం : తహశీల్దార్ ప్రభూలు

ప్రజలకు అందించాల్సిన ఆధార్ కార్డు, ఇతర పత్రాలను చెత్త కుప్పలో వేసిన నిర్లక్ష్యపు పోస్ట్‌మ్యాన్ నర్సింలుపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం. చెత్తకుప్ప నుంచి కొంతమంది వారికి సంబంధించినవి తీసుకుపోగా మిగిలిన ఆధార్, తదితర కార్డులను తహశీల్దార్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శుల ద్వారా అందిస్తామని చెప్పారు.

ధరణిపై లోతైన విచారణ జరిపిస్తాం

- కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ధరణి పోర్టల్‌పై లోతైన విచారణ జరిపిస్తామని కిసాన్ కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుందని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో మంత్రి హోదాలో దావోస్ పర్యటించిన కేటీఆర్ కాకిలెక్కలు చెప్పారని విమర్శించారు. విధ్వంసం అయిన వ్యవస్థను చక్కబెట్టడానికి కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయమైనా ఇవ్వాలని సూచించారు. ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ నేతలు అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో భూముల రిజిస్ట్రేషన్ వ్యవస్థ చాలా బాగుందనీ, దాన్ని అధ్యయనం చేస్తామన్నారు. ధరణిపై త్వరలో మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

మోసం చేసేందుకే ఎస్‌సి వర్గీకరణ కమిటీ

- ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దళితులను మోసం చేసేందుకే బిజెపి ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ కమిటీని నియమించిందని ఏఐసిసి కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్ విమర్శించారు. ఆ కమిటీని నియామకాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు చారకొండ వెంకటేష్, సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. పదేండ్ల తన హయాంలో దేశానికి బిజెపి ఏమీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉషా మెహ్రా కమిటీ నివేదిక సిద్ధంగా ఉందని, చిత్తశుద్ధి ఉంటే దానిని అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దళితులను దగా చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కమిటీ పేరు మీద దళితులను మోసం చేసిందని తెలిపారు.

ఇథనాల్‌తో ఆహార ధాన్యాల కొరత

- పర్యావరణానికి పెను ప్రమాదం
- చిత్తనూర్ ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే మూసేయాలి
- చర్చాగోష్టిలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆహార పంటలతో ఇథనాల్ ఇంధనాన్ని తయారు చేయడం వల్ల భవిష్యత్‌లో వాటి కొరత ఏర్పడే అవకాశముందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఆహార పంటలతో ఇథనాల్ ఇంధనం తయారు-సాధ్యత, సుస్థిరత, శాస్త్రీయత" అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడుతూ.. చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల అక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గత రెండేండ్లుగా స్థానికులు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోక పోగా అమాయకులపై అక్రమ కేసులు పెట్టిందని ఆరోపించారు. పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన ఈ పరిశ్రమను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి డాక్టర్ ఇఎఎస్ శర్మ మాట్లాడుతూ.. ఇథనాల్ ఇందనం తయారీ కోసం దేశంలో ఇప్పటి వరకూ లక్ష మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను ఉపయోగించారని అన్నారు. ఫలితంగా వాటి ధరలు ఆకాశానంటుతున్నాయనీ, ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇథనాల్ లక్ష్యం చేరుకోవాలంటే దేశంలో ఆహార సంక్షోభం తప్పదని హెచ్చరించారు. లీటర్ పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపి అమ్మకాలు సాగించడం ద్వారా దిగుమతులు తగ్గించాలనే లక్ష్యంతో కేంద్రం 2025 ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఒక లీటర్ ఇథనాల్ ఇంధనం తయారు చేసేందుకు 2.22 కేజీల మొక్కజొన్నలు లేదా బియ్యం, 3 గ్యాలన్ల ఇథనాల్ కోసం 29,100 గ్యాలన్ల నీరు అవసరమవుతుందని తెలిపారు. సర్కార్ ఎంచుకున్న లక్ష్యం పూర్తి కావాలంటే 1,643 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరమవుతాయని చెప్పారు. అంత మొత్తంలో వాటిని వినియోగిస్తే భవిష్యత్‌లో ఆహారంతో పాటు సాగునీటికి కష్టాలు తప్పవని అన్నారు. ప్రముఖ శాస్త్ర వేత్త బాబురావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నాయని అన్నారు. దేశంలోని 10 శాతం మంది ప్రజల విలాసవంతమైన జీవితం కోసం 90 శాతం మందికి హని చేస్తున్నారని ఆరోపించారు. బొగ్గు, పెట్రోల్ తదితర శిలాజ ఇంధనాల వల్ల వెలువడుతున్న కర్బన ఉద్గారాలతో భూతాపం పెరుగుతోందని చెప్పారు. 2030 వరకు పర్యావరణంలో భారీ మార్పులు సంభవిస్తాయనీ, ఫలితంగా మానవ మనుగడ కష్టమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు సైతం స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటి ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాలు మురికి వస్తువులను (పర్యావరణానికి హాని చేసే ఫార్మా మొదలగునవి) పేద దేశాల్లో ఉత్పత్తి చేయించి వాటిని తమ అవసరాల కోసం కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో రైతు స్వరాజ్యవేదిక నాయకులు కె.రవి, ప్రొఫెసర్లు ఆమంచి నాగేశ్వర్‌రావు, కేవై.రత్నం, పర్యావరణవేత్త రామారావు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

త్రివిక్రమ్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ అజ్ఞానం నుంచి బయటపడాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు అన్నారు. గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సినిమా దర్శకుడు త్రివిక్రమ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. సమ సమాజం కావాలని, ఆకలి, పేదరికం పోవాలని కోరుకున్న మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టడం వారిని అవమానించడమేనన్నారు. మహనీయులను అగౌరవపరిచే విధంగా ఉన్న సన్నివేశాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. త్రివిక్రమ్‌కు చిత్తశుద్ధి ఉంటే మార్క్స్, లెనిన్ జీవితాల ఆధారంగా సమాజ గమనానికి ఉపయోగపడే విధంగా సినిమాలు తీయగలరా? అని ప్రశ్నించారు. పిడిఎస్‌యు నాయకులు ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంటూరు కారం సినిమాలో మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని కోరుతూ ఫిల్మ్ చాంపర్‌లో సెక్రటరీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు.

తనికెళ్ల భరణికి బాపు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

బాపు సున్నిత సునిశిత మనస్వి

- ఎపి అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు

ప్రజాశక్తి - కల్చరల్

సినీ దర్శకులు, చిత్రకారుడు బాపు సున్నిత సునిశిత మనస్వి అనీ, అయన తీసిన ప్రతి చిత్రం కళాఖండమని ఎపి అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ బాబు అన్నారు. కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై బాపు 90వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ నటుడు, సాహిత్యవేత్త తనికెళ్ల భరణికి బాపు పురస్కారం ప్రదాన సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా విజయబాబు పాల్గొని పురస్కారం బహూకరించి మాట్లాడారు. నటనలో నవరసాలను పలికించే శక్తి భరణికి ఉందని, ఇందుకు కారణం రచయితగా అయన అక్షరాల్లో ప్రతి పాత్ర అవిస్కృతం అవుతుందని వివరించారు. ఎపి ప్రభుత్వ పక్షాన భరణికి జీవిత సాఫల్య పురస్కారం బహూకరిస్తామని ప్రకటించారు. సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ భరణి కేవలం నటుడు మాత్రమే కాదని, జీవితాన్ని కాచి వడబోసిన ఉన్నత వ్యక్తిత్వం గలవారని వివరించారు. నాట్య గురువు డాక్టర్ భారతి అధ్యక్షత వహించిన సభలో కళా పోషకులు కె.ఇ.రాజు, ఎం.వెంకటేశ్వరరావు స్వప్న పాల్గొన్నారు. ఈ సందర్భంలో బాపు 90వ జయంతిని పురస్కరించుకొని 90 మంది నాలుగేళ్ల బాలల నుంచి ఎనభై ఏళ్ల వయోధికుల వరకు వేసిన చిత్రాలు జైఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్టు సుభాషిణి ప్రకటించి సర్టిఫికేట్లు భరణి ద్వారా అందించారు. రికార్డ్ నమోదు పత్రం సంస్థ అధ్యక్షులు పుష్పలత అందుకున్నారు. కార్యదర్శి సురేందర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భారీగా తగ్గిన ఐడిబిఐ బ్యాంక్ ఎన్‌పిఎలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఐడిబిఐ బ్యాంక్ 57.3 శాతం వృద్ధితో రూ.1,458 కోట్ల నికర లాభాలు సాధించింది. కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసి కీలక వాటాలు కలిగిన ఈ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 17.4 శాతం పెరిగి రూ.3,434.60 కోట్లకు చేరింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 4.69 శాతానికి దిగివచ్చాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి ఏకంగా 13.82 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. 2023 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలోని 4.90 శాతం స్థూల ఎన్‌పిఎలతో పోల్చితే.. గడిచిన క్యూ3లో తగ్గుదల చోటు చేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 1.08 శాతం నుంచి 0.34 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభాలు 60 శాతం పెరిగి రూ.4,006 కోట్లుగా, నికర వడ్డీ ఆదాయం 29 శాతం వృద్ధితో రూ.10,499 కోట్లుగా నమోదయ్యింది.

యూనియన్ బ్యాంక్ ఫలితాలు అదుర్స్

క్యూ3 లాభాల్లో 60% వృద్ధి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో మొండి బాకీలకు కేటాయింపులు తగ్గడం, వడ్డీ ఆదాయంలో పెరుగుదలతో 60 శాతం వృద్ధితో రూ.3,590 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,249 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.24,154 కోట్లుగా ఉన్న బ్యాంక్ మొత్తం ఆదాయం.. క్రితం క్యూ3లో రూ.24,154కు చేరింది. బ్యాంక్ వడ్డీ ఆదాయం ఏకంగా రూ.25,363 కోట్లకు చేరింది. 2022-23 ఇదే క్యూ3లో రూ.20,883 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ 31 నాటికి యూనియన్ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) 4.83 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి 7.93 శాతానికి జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 2.14 శాతంగా ఉండగా.. 2023 డిసెంబర్ ముగింపు నాటికి 1.08 శాతంగా చోటు చేసుకున్నాయి.

కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు రూ.3,005 కోట్ల లాభాలు

హైదరాబాద్ : కొటాక్ మహీంద్రా బ్యాంక్ 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 7.63 శాతం వృద్ధితో రూ.3,005.01 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2022 ఇదే త్రైమాసికంలో రూ.2,791.88 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో సంస్థ నికర వడ్డీ ఆదాయం రూ.5,653 కోట్లుగా ఉండగా.. గడిచిన త్రైమాసికంలో 16 శాతం వృద్ధితో రూ.6,554 కోట్లకు చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.90 శాతం నుంచి 1.73 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 0.43 శాతం నుంచి 0.34 శాతానికి పరిమితమయ్యాయి.

అంచనాలు చేరిన ఐసిఐసిఐ బ్యాంక్

హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ 2023-24 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో 24 శాతం పెరుగుదలతో రూ.10,271 కోట్ల నికర లాభాలు సాధించింది. రూ.9,950 కోట్ల లాభాలు నమోదు చేయవచ్చని బ్లూమ్‌బర్గ్ వేసిన అంచనాల కంటే మెరుగైన ఫలితాలు ప్రకటించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 13 శాతం పెరిగి రూ.18,679 కోట్లుగా చోటు చేసుకుంది. ఇతర ఆదాయం 21 శాతం వృద్ధితో రూ.6,097 కోట్లుగా నమోదయ్యింది.

కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొమురవెల్లి దేవాలయానికి వెళ్లే యాత్రికుల కోసం కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలపడం పట్ల కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే స్టేషన్ ఏర్పాటులో ప్రత్యేక చొరవ తీసుకున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు శనివారం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మనోహరాబాద్ - కొత్తపల్లి మధ్యన నిర్మిస్తున్న కొత్త రైల్వే మార్గంలో లక్డారం - దుద్దెడ స్టేషన్ల మధ్యన కొమురవెల్లిలో కొత్త హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలను నియంత్రించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి నియంత్రించాలనీ, అక్రమ వెంచర్లపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఈ మేరకు రెరా చైర్మన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అసైన్డ్, చెరువు శిఖం, టెనెంట్ భూములు, లిటికేషన్ భూములను రైతుల నుంచి మార్కెట్ కన్నా తక్కువ ధరలకు కొంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటి ధరలను కోట్ల రూపాయలకు పెంచి పేదల సొమ్మును కొల్లగొడుతున్నారని విమర్శించారు. రెరా అనుమతులు లేకున్నా సినీ హిరోలు, ఆర్టిస్టులు, సెలబ్రిటీలతో ఇష్టానుసారంగా ప్రకటనలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఆ వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

విధుల్లో అలసత్వం చూపొద్దు

- వన్యప్రాణుల మరణాలు మళ్లీ చోటుచేసుకోవద్దు
- ఫారెస్టు అధికారులతో పిసిసిఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అధికారులతో సమీక్షిస్తున్న డోబ్రియల్

అటవీశాఖ అధికారులు విధుల్లో అలసత్వం చూపకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పిసిసిఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం డోబ్రియల్ సూచించారు. తరుచూ క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. వన్యప్రాణుల మరణాలు మళ్లీ చోటుచేసుకోకుండా చూడాలని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ నుంచి అటవీ శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి పాత్ర చాలా కీలకమనీ, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కి చెప్పారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో రెండు పెద్ద పులులు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. అటవీశాఖ చేపట్టిన పలు చర్యల వల్ల కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కారిడార్) పులులకు శాశ్వత నివాసంగా మారుతోందనీ, ఇలాంటి సమయంలో పులులు మరణించకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండేదన్నారు. అటవీ అధికారులు, సిబ్బంది పనితీరులో అలసత్వం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చీఫ్ కన్జర్వేటర్ స్థాయి నుంచి బీట్ అధికారి వరకు ప్రతీ ఒక్కరూ తరచుగా క్షేత్ర పర్యటనలు చేయాలనీ, కేటాయించిన అటవీ బీట్‌లలో ఫుట్ పెట్రోలింగ్ చేయాలని (కాలినడక పర్యవేక్షణ) చెప్పారు. అడవులకు నష్టం చేసేవారిని, వన్యప్రాణులను హతమార్చే వారిని శిక్షించేందుకు అత్యంత కఠినమైన అటవీ చట్టాలు ఉన్నాయనీ, వాటి ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్ఫార్మర్లతో పాటు, నిఘా వ్యవస్థను పటిష్టపరుచుకోవాలని సూచించారు. అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పెంచాలని సూచించారు. చెక్ పోస్టులను పటిష్టం చేయటంతో పాటు, నైట్ పెట్రోలింగ్‌ను మరింతగా పెంచాలనీ, ఆధునిక సాంకేతికతను వాడాలని ఆదేశించారు.

సమర్థవంతంగా క్యాచ్ ద ట్రాప్ కొనసాగింపు : పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎం.సీ పర్గెయిన్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన క్యాచ్ ద ట్రాప్ (ఉచ్చులు, వలలను పట్టుకోవటం) సమర్థవంతంగా కొనసాగుతున్నదనీ, ఇప్పటి వరకు 1320 ఉచ్చులను అటవీ శాఖ స్వాధీనం చేసుకున్నదని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ.పర్గెయిన్ చెప్పారు. సుమారు ఏడు వందల కేజీల ఇనుప వస్తువులను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అచ్చంపేట, కాగజ్ నగర్ జిల్లాల్లో 12 చొప్పున కేసులు నమోదయ్యాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాలకు చెందిన చీఫ్ కన్జర్వేటర్లు, ఫీల్డ్ డైరెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ రిపబ్లిక్ డే ఆఫర్లు

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే సేల్ ఆఫర్లను ప్రకటించింది. ఎంపిక చేసిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లపై 57 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది. ప్రీమియం, లైఫ్ స్టైల్ టివిల్లోని ఎంపిక చేసిన మోడళ్లపై 48 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు పేర్కొంది. రిఫ్రిజిరేటర్లపై గరిష్టంగా రూ.15,125 వరకు ఎక్స్ఛేంజీ సహా 52 శాతం తగ్గింపు పొందవచ్చని తెలిపింది. మైక్రోవేవ్, ఫుల్లీ ఆటోమేటిక్ వాషింగ్ మిషన్లపై క్యాష్ బ్యాక్, డిస్కౌంట్లను అందిస్తున్నట్లు వెల్లడించింది.

ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్, ఎఎంఎస్‌టి ఏవియేషన్ మధ్య ఒప్పందం

హైదరాబాద్ : ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్, ఆస్ట్రియా దేశానికి చెందిన ఎఎంఎస్‌టి ఏవియేషన్ సంస్థలు పరస్పరం ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. పైలట్ శిక్షణకు సంబంధించి హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 ప్రదర్శనలో భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ ఒప్పందం ద్వారా పైలట్ శిక్షణ కోసం ఎఎంఎస్‌టి ఏవియేషన్ సంస్థ మూడు అత్యాధునిక ఎ320నియో, బి737 మాక్స్ 2024 ఎయిర్ ఫాక్స్ ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్‌ల ట్రైనింగ్ సర్వీస్ లను ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్‌కి అందిచనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా మెరుగైన పైలట్ శిక్షణను అందిస్తూ.. దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనుందని ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ కౌశిక్ మానెపల్లి తెలిపారు.